# ఆహ్వాన పత్రిక

''అక్కా ! నీకు ఉత్తరం వచ్చింది.'' వెంకటరమణ తెచ్చియిచ్చాడు.

వినయమణి హైస్కూలు టీచరు. పెరట్లో జామచెట్టుకింద చాపలేసుకుని స్కూలు పిల్లలి పరీక్షాపత్రాలు దిద్దుతూ కూర్చుంది.

చలికాలం ఎండపొడన కూర్చుంటే కాస్తవెచ్చగా ఉంటుందనుకుంది. కాని సూర్యుడు మబ్బులచాటున ఉండి తన వెచ్చటి కిరణాలను 'అదిగో - ఇదిగో' అంటూ వాటిని పుడమిని చేరుకోనివ్వకుండా దోబూచులాడుతున్నట్టుగా ఉంది. ఆ నులివెచ్చని కిరణాలకోసం జామచెట్టుకొమ్మల సందుగుండా చూస్తూ కొంగు ఒంటినిండా కప్పుకుని కూర్చుంది వినయమణి.

"నాకెక్కడిదిరా ఉత్తరం?" అంటూ పేపర్లు పక్కకు పెట్టి, లేచి అందుకుంది. కుతూహలంతో కవరును అటూ ఇటూ తిప్పిచూసింది ముద్రకోసం. ముద్రలో అక్షరాలు కనబడీ కనబడకుండా ఉన్నాయి. ''అక్కడినుంచి నాకు ఉత్తరం రాసేవాళ్ళెవరబ్బా ?" అనుకుంటూ చింపిచూసింది.

జెర్రి ఒంటిమీద పాకుతుంటే దేహం జలదరించి భయంపుట్టినట్లయింది.

''ఏదయినా వచ్చిన ఉత్తరం చదవాలి" అనుకుంది.

ప్రియమైన వినయా!

నీవు ఇక్కడినుంచి వెళ్ళినతరువాత పద్దెనిమిది కేలండర్లు తిరిగాయి. కాని ''నేనుఅక్కడికి వస్తున్నానన్న" ముక్క నాకు తెలియపరచలేదు. ఒకవేళ ఉత్తరం రాశావేమో గాని నాకు అందలేదు.

నేనేమయిపోతాననుకున్నావు ?

నీవు ఇక్కడలేని కాలంలో నీ రాకవిషయం నీవుగాని మీ తల్లిదండ్రులు గాని తెలపకపోవటంతో మా అమ్మ ఒక నంగిమాటలపిల్లను తీసుకువచ్చి నాకు

పెళ్ళిచేసింది. కన్నతల్లిని కాదనలేక - ఏదో పెద్దది - ఏంచేసినా భరించవలసిన వాడిని కనుక మాట్లాడకుండా ఊరుకున్నాను.

దానికి ముగ్గురాడపిల్లలూ ఇద్దరు మగపిల్లలూ పుట్టారు. ఏదో కళ్లు మూసుకుని కాపరం చేస్తున్న నాకు విధి మరొక శిక్షవేసింది. నాలుగురోజులు జ్వరం వచ్చి దానికి కళ్ళు సరిగా కనబడకుండా పోయాయి. ముఖం వికృతమైంది. అది వంటచెయ్యలేదు. పెద్దదయిన మా అమ్మను చూడలేదు. ఇంటినీ పిల్లలనూ సవరించుకోలేదు.

అమ్మ పెద్దదయినా కళ్ళు ఉన్నాయి కనుక పిల్లలనూ ఇంటినీ కాస్త కనిపెట్టి చూసేది. కాని - నాకు ఈ స్థితిలో తల్లికూడా కరవైపోయింది.

నేనిప్పుడు ఎంత సంపాదించుకుంటున్నా నిస్సహాయుడిని.

నీవు అగ్నిసాక్షిగా పదిమందిఎదుట మంగళసూత్రం కట్టించుకున్న భార్యవు. ఇంటిబాధ్యత వహించవలసిన దానవు. నేను ఒకవేళ కోపంవచ్చి 'వెళ్ళిపో' అన్నానే అనుకో. అన్నంతమాత్రాన ఇంటినుంచి వెళ్ళిపోవటమేనా ? మన సంబంధం అంతటితో తెగిపోతుందనుకున్నావా ? మన మధ్యగల సంబంధం చట్టబద్ధమైనది కాదనుకుంటావేమో ? అగ్నిసాక్షిగా జరిగిన పెళ్ళి. అంతకంటె చట్టం గొప్పదికాదు. అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకున్న భార్యవైన నీకు సంసారాన్ని తీర్చిదిద్ది భర్తకు చేయూతనిచ్చే బాధ్యత ఉన్నదని ఉపాధ్యాయినిగా నీవు మరిచిపోవనుకుంటాను.

ఉపాధ్యాయులను మనపెద్దలు బ్రహ్మ విష్ణు మహేశ్వరులతో పోల్చారు. బిడ్డలకు మంచిచెడ్డలు చెప్పగల శక్తి యుక్తి మమతగల వారన్నారు.

తప్పులను దిద్దటమే గురువుల బాధ్యత.

కనుక నీవు వెంటనే బయలుదేరి వచ్చి, నీ సంసారాన్ని చక్కదిద్దుకుంటావని భావిస్తూ నీ బాధ్యతను మరొకసారి నీకు గుర్తుచేస్తున్నాను.

ఇట్లు
నీ మనోరంజన్

ఆ ఉత్తరం చదువుకొని పంచభూతాలనూ ఒకసారి తలుచుకుంది. వాటిలో కలుపుకొమ్మని.

అది అగ్నిసాక్షిగా జరిగినపెళ్ళి.

పదివేల కట్నమందుకున్న పెళ్ళి.

నిజంగా అతడికెంతో అన్యాయం జరిగిందా ?

అతడు నిస్సహాయస్థితిలో ఉన్నాడా ?

తను అగ్నిసాక్షిగా వివాహంచేసుకున్నభార్య. తననూ తన సంసారాన్ని ఇక్కట్లపాలు చేసినట్టు ఎంతదీనంగా రాశాడు ? భార్య అన్యాయం చేసిపోయి నట్టు ఎంతగా మనసు కరిగేటట్టు రాశాడు ?

అదీ పద్దెనిమిదేళ్ల తరువాత !

1935లో వీధి తలుపులన్నీవేసి, తల్లి పొయ్యిలో ఇనుపచువ్వ కాలుస్తూ ఉండగా అగ్నిసాక్షిగా వివాహమాడిన వినయమణిని, ఏదో చిన్న పొరబాటు జరిగిందని పెరట్లో చెట్టుకు కట్టేసి, కదలకుండా గట్టిగాపట్టుకుని తల్లిచేత ఒంటి నిండా వాతలు పెట్టించాడు. ఆమె అరుస్తూ ఏడ్చే ఏడ్పులకు ఇరుగు పొరుగులు చూసిపోతారని ఒంటిమీద అరటి ఆకులు కప్పి, లోపలికి వెళ్ళి తలుపులు వేసు కున్న మనోరంజన్ రాసిన మామూలు ఉత్తరం కాదది - ఆహ్వానం.

ఇరుగుపొరుగులు ఆ కేకలువిని గోడమీదినుంచి చూసి భరించలేక, ఆమె తల్లిదండ్రులకు అర్జెంట్ టెలిగ్రామ్ ఇవ్వగా, వెంటనే ఏడుస్తూ వచ్చినవాళ్లకు "మీ అమ్మాయి ఇంట్లోనుంచి వెళ్ళిపోయింద'ని తలుపులు వేసుకుంటే, పక్క యింటివారి సలహామీద పోలీసు సహాయంతో - ఆ స్థితిలో ఉన్న పిల్లకు ఒంటి నిండా బట్టకప్పి తల్లిదండ్రులు తీసుకుపోతుండగా కిటికీలోనుంచి ఏమీపట్టనట్టు చూసిన మనోరంజన్ ఈనాడు తనకు బాధ్యతలను తెలియబరుస్తూ రమ్మని ఆహ్వానిస్తున్నాడు సాదరంగా.

పరువుకోసం కోర్టుకెక్కని తల్లిదండ్రులు-చదువుచెప్పించి, తమయింట్లో ఉండటానికి అభిమానపడే కూతురికి పెరట్లో విడిగా ఒకగది కట్టించి, పెళ్ళిలో

ఇచ్చిన కట్నం ఒక బిచ్చగాడికి ఇచ్చామనుకుని, కూతుర్ని "టీచరు ఉద్యోగం చేసుకుంటూ జీవనం చెయ్యమని" దారిచూపించిన ఆ కన్నవారిని చూసుకుంటూ కాలం గడుపుతున్న తనకు - అగ్నిసాక్షిగా వివాహమాడిన భర్త - ఒంటినిండా వాతలు వేయించి ఎవరికీ కనబడకుండా అరిటిఆకులు కప్పిన భర్త - ఆమెను తల్లిదండ్రులు తీసుకొనిపోతుండగా కిటికీలోనుంచి చూసినభర్త - ఆ భార్య తన కేదో అన్యాయం చేసి వెళ్ళిపోయిందన్న బాధతో మనసుకరిగేటట్టు, పద్దెనిమిదేళ్ల తరువాత పంపిన ఆహ్వానమది.

పాపమాదీనుడికి ఏమని జవాబురాయాలి ?

ఆ యింట మళ్ళీ అడుగు పెట్టమనా ఆ పిలుపు ?

వాతలమీద అరటి ఆకులు కప్పి పోతూ పోతూ కాలితో తన్నిన అతడు నా మనోరంజన్ అయ్యాడా ? ఇది ఎప్పటినుంచి ?

నాలుగు సంవత్సరాలు అక్కడ ఉన్నా తల్లితో మంతనాలేగాని తనతో ఒక్కమాట మాట్లాడేడా ? ఆ నాలుగు సంవత్సరాలు చాకిరి చేయించుకుని పాసి పోయిన అన్నంపెట్టిన తల్లి-నంగిపిల్లను-ఎక్కువ కట్నమిస్తామనగానే కొడుక్కు పెళ్ళి చేసిందేమో ? నాకు బాధ్యతలను గుర్తుచేసిన పెద్దమనిషి తన బాధ్యత లేమిటో గుర్తుపెట్టుకోలేదు పాపం.

వికలమైన మనస్సుతో ఇంత పేపర్లు దిద్దలేక కట్టలు కట్టి గదిలో పెట్టింది. మరునాడు పిల్లలకు చెప్పవలసిన పాఠం చూసుకుంది. చాపమీద పడుకోగానే నిద్రవచ్చింది.

మరునాడు స్కూలుకు వెళ్ళినప్పుడు 'గుడ్‌మార్నింగ్ టీచర'ని తన క్లాసు పిల్లలు సంతోషంతో గంతులువేస్తూ తన దగ్గరికి వస్తుంటే ఆమెకెంతో ఆనందం కలిగింది. వాళ్లల్లో కొందరు ఆడపిల్లలు. వీళ్ళ జీవితాలెట్లా గడుస్తాయో ?

కంట తడిపెట్టని ఆడపిల్ల ఒక్కతైనా ఉంటే అది ఎంతో అదృష్టమను కోవాలి ఈ కాలంలో. తన తల్లిదండ్రులు ఎంత సంబరంతో చేసిఉంటారు పెళ్ళి? ఒక్కతే పిల్లఅని ఎంతగారాబంగా పెంచారు ? తండ్రి పెళ్ళిలో వాళ్ళను ఎంత మర్యాద చేశాడు ?

ఈ దురదృష్టమంతా ఎవరిదనుకోవాలి ?

ఇప్పటికీ తను అదృష్టవంతురాలే ననుకుంటుంది వినయమణి. ఆ రోజుల్లోనే ఒక పేరుపొందిన సంఘసేవకురాలు జ్వరంతో ఉన్న ఆరేళ్ళ పిల్లవాడిని తన దగ్గరుంచుకుని కోడలిని ఇంట్లోనుంచి పంపించేసింది. ఆ అమ్మాయికి ఆ ఊర్లో అయినవాళ్ళుగాని తెలిసిన వాళ్ళుగాని లేరు. కళ్ళనీళ్లుకారుస్తూ పక్కయింటి వారితో తనగోడు చెప్పుకుని ఏడ్చింది. వాళ్ళింట్లో రెండురోజులుంది. ఇంట్లోకి వెళ్ళి కొడుకును చూటటానికి వీలుకాక దొంగచాటుగా కిటికీలోనుంచి చూసి వచ్చి ఏడ్చేది. పిల్లవాడి తండ్రి ఊళ్ళోఉన్నా కొంతబాధ తగ్గేది. కాని, తండ్రి ఊళ్లో లేకుండా చూసి జ్వరం వచ్చిన పిల్లవాడికి తల్లినికూడా దూరంచేసిందా సంఘసేవకురాలు. కిటికీలోనుంచి చూస్తున్నదని కిటికీ తలుపులు మూయించింది. ఇంక ఆ తల్లి ఆగలేక పక్కయింటివారినే పదిరూపాయలడిగి తల్లిదండ్రులను చేరుకుని, పిల్లవాడికోసం తండ్రిని పంపించింది. ఆ తండ్రి ఎంత బ్రతిమిలాడినా పిల్లవాడిని ఇవ్వక తిట్టి పంపించింది.

తల్లికోసం ఏడ్చి ఏడ్చి ఆ పిల్లవాడు చనిపోయాడు.

ఆ కబురువిన్న తల్లి పిచ్చిదయి పోయింది.

ఆ కేసుతో పోల్చిచూస్తే తను అదృష్టవంతురాలనే అనుకుంది వినయమణి. తనకున్న పరిస్థితులలో పిల్లలుంటే ఎన్ని సమస్యలు ఉద్భవించేవో ?

తనపని ఇప్పుడు హాయిగా ఉంది. ఇంత వండుకుని తిని స్కూలుకు వెళ్తుంది. ఆ పిల్లలకు ప్రేమతో పాఠాలు చెబుతుంది. వాళ్ళను ఆప్యాయంగా పలకరిస్తుంది. కొందరు ఇంటికి వస్తారు. పాఠం చెప్పమని. వాళ్ళకు పాఠంచెప్పి భోజనంకూడా పెడుతుంది.

ఇంక తనకేంకావాలి ? ఇంత మంది పిల్లల ఆదరాభిమానాలకు నోచుకున్నది తన మనసు.

ఆ రాత్రి ఒక నిశ్చయానికి వచ్చిన తరువాత ఆమె హాయిగా నిద్రపోయింది.

కాని, ఆమెను వేధిస్తునే ఉన్నాడు మనోరంజన్ "రాకపోతే మానే, ఉత్తరం రాయటానికేమి ?" అంటూ.

వినయమణి మాత్రం ఉత్తరాలు రాయటం కూడా అనవసరమనుకుంది. వచ్చిన ఉత్తరాలను ఎప్పటికప్పుడు పొయ్యిలో పడేసి నీళ్లుకాచుకునేది.

తరువాత రిజిస్టర్డు ఉత్తరాలు రాయటం మొదలుపెట్టాడు. వాటిని ఆమె తీసుకోనేలేదు.

"నీవు రాకపోతే మళ్ళీ పెళ్ళిచేసుకుందామనిపిస్తోం"దంటూ కొన్ని ఉత్తరాలు రాశాడు. వాటికి జవాబు లేదు.

"నీవేమయినా పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నావా ?" అని రెచ్చగొడుతూ కొన్ని ఉత్తరాలు వచ్చాయి. నవ్వుకుంది వినయమణి.

ఒక వైపునుంచే వచ్చే ఉత్తరాలు హఠాత్తుగా రావటం ఆగిపోయింది. ఇంక నిశ్చింతగా ఉండవచ్చు ననుకున్న వినయమణికి ఒకనాడు హఠాత్తుగా ఒక వార్త వినవచ్చింది. మనోరంజన్ అనే ఆఫీసరు తన పిల్లలను బోర్డింగుస్కూల్లో ఉంచి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడని.

అప్పుడు వినయమణి మనసు చివుక్కుమన్నది. సంగిమాటలదో కళ్ళ కన బడనిదయినా తల్లిని చూసుకుంటూ ఉండేవారు కదా పిల్లలు ? భర్త అంతపని చేస్తే పాపమామెగతి ఏమయిందో ? మనసు విలవిల్లాడిపోయి ఉంటుంది. అమ్మా అన్న పిలుపుతో ఆనందపడే ఆ తల్లి దానికి కూడా నోచుకోలేదు.

తనకు తల్లిదండ్రులుండి తన జీవితానికొక బాట ఏర్పరచారు. పాపమామెకు ? ఆమెకు దిక్కెవరు ? ఆపిల్లలకు తల్లి ఆదరణ ఏది ?

ఇటువంటి వార్తలు విన్న, కన్నవారు కూడా ఎవరికో ఒకరికి ముడిపెట్టాలని తమ పిల్లల సంబంధాలకోసం ఇంకా తెగతిరుగుతారే చెప్పులరిగేటట్టు ?

"కంటితో ఇటువంటి కుటుంబాలను చూసికూడా తల్లిదండ్రులలో మార్పు రాకపోతే, ఆడపిల్లలలో మార్పు వచ్చిందనుకోవటం పొరబాటవుతుంది" అనుకుంది. అందరూ తన పిల్లలే అనుకుంటూ వాళ్ళను ప్రేమతో చూస్తే వినయమణి

తను పాఠశాలకు వెళ్ళి పిల్లలను పేరు పేరునా పిలిచి, వాళ్ళ మనసుల్లో మధువును చిలకరిస్తూ పలకరించి, వీపుమీద తట్టి క్లాసుల్లోకి పంపిస్తుంది.

కని పెంచక పోయినా ఆమె పిల్లలు స్కూలునిండా ఉన్నారు. జగమంతా ఉన్నారు. వాళ్ళే అమ్మా అని పిలుస్తారు.

